
ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి మాధవీలత (ఫైల్)

జై అంటే జై

కార్వాన్‌లో జోరుగా బీజేపీ,
మజ్లిస్ పార్టీల ప్రచారాలు
రోడ్ షోలతో అదరగొడుతున్న మజ్లిస్
ఇంటింటి ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకుంటున్న బీజేపీ


మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ రోడ్ షో (ఫైల్)

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన మజ్లిస్, బీజేపీలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. ప్రచారంలో పై చేయి సాధించడానికి ఇరు పార్టీలు సర్వశక్తులు ఉపయోగిస్తున్నాయి. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కార్వాన్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ మజ్లిస్ అభ్యర్థి సుమారు 40 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తూ వస్తున్నారు. మజ్లిస్ కంచుకోటను ఛేదించేందుకు బీజేపీ కూడా సర్వశక్తులతో సిద్ధమవుతుంది. కార్వాన్ నియోజకవర్గంలో జియాగూడ డివిజన్ బల్దియా డివిజన్ ఒక్కటే బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తుంది. దీంతో పాటు మజ్లిస్‌కు ఈసారి మైనార్టీలు మద్దతు పలుకుతున్నారు. అయితే మజ్లిస్ అభ్యర్థి మాత్రం బీజేపీలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకెళ్లాలని పక్కా ప్రణాళికతో ప్రచారం కొనసాగిస్తున్నారు. కాగా కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీలో గతంలో ఉన్న వర్గ పోరాటాలను ఖతం చేసి బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్ని మోర్చాల నాయకులతో కలిసి ముందుకుసాగుతున్నారు.

మజ్లిస్ ముందస్తు వ్యూహాలతో..

మజ్లిస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గంలో పట్టును పెంచుకునేందుకు ముందస్తు వ్యూహాలతో ప్రచారం నిర్వహిస్తుంది. ఆ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ రోడ్ షోలు నిర్వహిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. స్థానిక సమస్యలతో పాటు దేశ సమగ్రత, బీజేపీ మైనార్టీ, దళిత వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. మరోవైపు మజ్లిస్ శాసన సభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ సైతం కార్వాన్ నియోజకవర్గంలో తనవంతు ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత వారం ఆయన నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈద్ మిలాప్ పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆయన మజ్లిస్ వ్యూహాన్ని స్పష్టం చేశారు.

బీజేపీ ఇంటింటి ప్రచారానికి స్పందన..

బహిరంగ సభలు లాంటి భారీ సభలు, సమావేశాల జోలికి పోకుండా బీజేపీ అభ్యర్థి మాధవీలత తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఇంటింటి ప్రచారం పేరుతో ఆమె స్వయంగా మహిళలను కలుసుకుంటున్నారు. మహిళలను తమవైపు తిప్పుకునేందుకు ఆమె నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారానికి స్పందన బాగా వస్తుంది. పనిలో పనిగా ఆమె ఆలయాలను కూడా సందర్శిస్తూ మహిళలను తమవైపు తిప్పుకుంటున్నారు. గత సంవత్సర కాలంగా ఆమె కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో తిరుగుతూ ఓటర్లకు బాగా చేరువయ్యారు.

మజ్లిస్ కార్నర్ మీటింగ్‌లు..

మజ్లిస్ పార్టీ రాత్రి పూట కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తుంది. ఇటువంటి కార్యక్రమాలకు ప్రజల నుంచి బాగా స్పందన వస్తుంది. ఆ పార్టీ అగ్ర నాయకులు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ కార్నర్ మీటింగ్‌లలో మజ్లిస్ పార్టీ ఆశయాలు, చేస్తున్న అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. అక్బరుద్దీన్ ఒవైసీకి ధీటుగా మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ నిర్వహిస్తున్న కార్నర్ మీటింగ్‌లు విజయవంతం అవుతున్నాయి. మజ్లిస్ పార్టీలో పార్టీ అనుబంధ విభాగాలు లేనందు వల్ల అందరూ కలిసికట్టుగా పని చేసే రివాజు ఉంది. మరోవైపు మజ్లిస్‌కు ధీటుగా బీజేపీ వారు ఇంటింటికీ మోదీ కరపత్రాల కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో నాయకులు, కార్యకర్తలు విడివిడిగా ఓటర్ల ఇంటికి వెళ్లి మోదీ విజయాల కరపత్రాలతో పాటు అబ్‌కీ బార్ చార్‌సౌ పార్ అనే కరపత్రాలు ఓటర్లకు అందిస్తున్నారు. ముఖ్యంగా ఇటువంటి కార్యక్రమం లంగర్‌హౌస్, కార్వాన్ డివిజన్‌లలో మంచి ఫలితాలు ఇస్తుంది. ఏదేమైనా పట్టును పెంచుకోవడానికి మజ్లిస్, మజ్లిస్‌పై పైచేయి సాధించేందుకు బీజేపీలు శక్తివంచన లేకుండా ప్రచార పర్వం నిర్వహిస్తున్నాయి.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి


ఆలే జితేంద్ర, మాజీ కార్పొరేటర్

గౌలిపురా: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 23న నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర సూచించారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం గౌలిపురాలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం 6 గంటలకు హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ శోభాయాత్ర గౌలిపురా మార్కెట్, సుల్తాన్‌షాహీ, ఉప్పుగూడ, హనుమాన్‌నగర్ మంగళముఖి ఆలయం, ఛత్రినాక, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ రాజేశ్ మెడికల్ హాల్, అక్కన్న మాదన్న ఆలయం, బేలా చౌరస్తా, మీర్‌కా దయారా మీదుగా తిరిగి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు.

యాకుత్‌పురాలో మజ్లిస్ ప్రచారం


ప్రచారంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సోమవారం మజ్లిస్ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా రెయిన్‌బజార్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి యాసర్ అరాఫత్, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, నాయకులు, కార్యకర్తలతో కలిసి రెయిన్‌బజార్, ఎస్ఆర్‌టీ కాలనీ, సూపర్ బజార్, యాకుత్‌పురా రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ అసదుద్దీన్ ఒవైసీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పర్యావరణ సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి


కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వాణిప్రసాద్

గన్‌ఫౌండ్రీ: పర్యావరణ సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐఏఎస్ అధికారి ఎ.వాణిప్రసాద్ అన్నారు. సోమవారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఇండియా హైదరాబాద్ చాప్టర్, అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ కమ్యూనికేషన్, బిర్లా సైన్స్ సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు నీట్ జియో సైన్‌సిస్ట్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పర్యావరణంపై అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హెచ్‌కే.గుప్తా, డాక్టర్ ఎస్.వెంకటమోహన్, డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు, డాక్టర్ సి.మాణిక్యాంబ, డాక్టర్ ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్, బీజేపీలను ఓడిస్తా: శ్రీనివాస్‌యాదవ్


గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమంతోనే హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్, బీజేపీలను ఓడిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మహేష్‌నగర్‌లో మరాఠ సామాజికవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరించారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ..మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ అభ్యర్థి మాధవీలత ఓటర్లను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారన్నారు. మతం పేరుతో ఓట్లు దండుకునే ఒవైసీ, మాధవీలతకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఇద్దరు అభ్యర్థులను ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి


నాగదుర్గా ప్రసాద్, మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్

గౌలిపురా: హనుమాన్ జయంతి ఉత్సవాలు, బైక్ ర్యాలీలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ సూచించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ..హనుమాన్ జయంతి ఉత్సవాలు, ర్యాలీల సందర్భంగా స్టేషన్ పరిధిలోని గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ర్యాలీలను ఆధ్యాత్మిక, భక్తి వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

కాలుష్యం నుంచి నేలతల్లిని కాపాడండి



రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

అబిడ్స్: కాలుష్యం నుంచి నేలతల్లిని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ జియోగ్రఫీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ అశోక్‌కుమార్ నోనావత్ పేర్కొన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ నారాయణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ప్రొఫెసర్ అశోక్‌కుమార్ నోనావత్ ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలు అణుబాంబు కంటే ప్రమాదకరమని, వాతావరణం కాలుష్యంగా కాకుండా ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. భూమి అంటే మట్టి మాత్రమే కాదని 84 లక్షల జీవ రాసుల సముదాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మహ్మద్ అక్తార్ అలీ, అమీర్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూఖ్ అలీఖాన్, ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వరలక్ష్మి, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఉదయశ్రీరెడ్డి, రామకృష్ణ శాస్త్రి, కస్తూరి, సరిత, అనిత, బత్తుల హేమావత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా ఫలితాలపై ఆందోళన వద్దు

గోల్కొండ: తాము రాసిన పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందవద్దని ప్రముఖ సైకాలజిస్ట్, తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎ.కరీం అన్నారు. ఏప్రిల్ చివరి వారంలో వివిధ పబ్లిక్ పరీక్షల ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో ఆయన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు ఎంతో ధైర్యంగా రాసిన విద్యార్థులకు పరీక్ష ఫలితాల తేదీలు తెలిసినప్పటి నుంచి ఆందోళన చెందుతారని ఆయన అన్నారు. పిల్లల్లో మానసిక ఒత్తిడి పెంచకుండా ధైర్యాన్ని నింపాలని కోరారు. పరీక్షల్లో తప్పిన, మార్కులు తక్కువ వచ్చినా మళ్లీ పరీక్ష రాయవచ్చు అన్న విషయం పిల్లల్లో నూరిపోయాలన్నారు.

ఆర్థిక సాయం

గోల్కొండ: సంపూర్ణ ఆరోగ్యంతోనే అనుకున్నది సాధించవచ్చునని షేక్‌పేట్ నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ భరత్‌కుమార్‌గౌడ్ అన్నారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి వైద్యులు కేన్సర్‌గా నిర్ధారించారు. ఆ విద్యార్థి కుటుంబం వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిధిని సేకరించారు. సోమవారం పాఠశాలలో ఆ డబ్బులను కరస్పాండెంట్ భరత్‌కుమార్‌గౌడ్ విద్యార్థికి అందించారు. ఆయన మాట్లాడుతూ..అతడికి కేన్సర్ నిర్ధారణ కాగానే తాము ఎంతో ఆందోళనకు గురయ్యామన్నారు. కేన్సర్‌పై విజయం సాధించేందుకు తమవంతు సహాయంగా అతడి కుటుంబానికి అండగా ఉంటున్నామని ఆయన పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు


స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు, వీవీ ప్యాడ్లను చేర్చిన ఏఆర్‌ఓలు విక్టర్, విద్యాధర్ తదితరులు

అబిడ్స్: పార్లమెంటు ఎన్నికల కోసం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు, వీవీ ప్యాడ్లను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఏఆర్‌ఓలు విక్టర్, విద్యాధర్, మన్నె ప్రేమ్‌కుమార్ పోలీస్ సిబ్బంది భద్రత మధ్య కోఠిలోని ఉమెన్స్ కళాశాలలో ఉన్న ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరిచారు. ఈ సందర్భంగా ఏఆర్‌ఓలు విక్టర్, విద్యాధర్, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ..గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఎంసీఎంలో టోపీల ఎగ్జిబిషన్ ప్రారంభం


కొనసాగుతున్న ఎగ్జిబిషన్‌లో టోపీల ప్రదర్శన

చార్మినార్: ఎండ వేడిమి నుంచి కాపాడుకునే విధంగా రూపొందించిన టోపీల ప్రదర్శన మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ (ఎంసీఎం)లో సోమవారం ప్రారంభమయ్యింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన పలు రకాల టోపీలతో రెండు నెలల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను మహ్మద్ క్యాప్‌మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుస్తులు, టోపీలు, గొడుగులు, దుప్పట్లు తదితర వస్త్ర వ్యాపార రంగంలో 113 ఏళ్ల చరిత్ర కలిగిన తాము పాతబస్తీలోని తమ షో రూంలో ఈ ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎండా కాలంతో పాటు వర్షా కాలంలో కూడా రెయిన్ కోట్స్, టోపీలను అందుబాటులో ఉంచామన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా శ్రీనివాస్‌యాదవ్ నామినేషన్ దాఖలు


కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టికి నామినేషన్ పత్రాలు అందజేశారు. సోమవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఈనెల 24న బుధవారం భారీ ర్యాలీగా వచ్చి మరో రెండు నామినేషన్ సెట్లు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంట్‌లో మతం పేరు చెప్పి ఓట్లు దండుకునే మజ్లిస్, బీజేపీలు కనుమరుగవుతాయన్నారు. అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్‌నే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే


వేడుకల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వజాహత్ అలీ షా


ప్రశంసా పత్రాలతో పాటు మెడల్స్ అందుకున్న విద్యార్థులు

చార్మినార్: ఉన్నత విద్యాభ్యాసంతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని జీఎన్‌టీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వజాహత్ అలీ షా అన్నారు. చార్మినార్‌లోని నారాయణ ఈ–టెక్నో స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులు ఈ వేడుకల్లో తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రాలతో పాటు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైస్కూల్ చదువు పూర్తి కాగానే ఇతర కాలేజీల్లో చేరే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, హెచ్‌ఆర్ లక్ష్మీగౌరీ, ఆర్ అండ్ డీ మహేశ్వరి, కో ఆర్డినేటర్స్ నూర్జహాన్, లక్ష్మీ భవానీ, ఆజాద్, ప్రిన్సిపాళ్లు శారద, తహెనియత్, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, తబస్సుం పాల్గొన్నారు.

అన్నదానం



గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులకు వైద్యులు సూచించిన విధంగా ఆహారాన్ని అందిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం ఆయన వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము నిర్వహిస్తున్న ఈ నిత్యాన్నదాన కార్యక్రమం మూడేళ్లుగా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో ఎక్కువ శాతం పేదలే ఉంటారని, అందువల్లే వారికి నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు.

నేడు రత్నాబాయి గల్లీలో హనుమాన్ జయంతి

చార్మినార్: హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ఉదయం పాతబస్తీ హుస్సేనీ ఆలం రత్నాబాయి గల్లీలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నట్లు పండిత్ దేవేంద్ర దివ్వేది తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున మూడున్నర గంటలకు రథ యాత్రతో హనుమాన్ జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకు అభిషేకం, సాయంత్రం 6 గంటల నుంచి ఏడున్నర గంటల వరకు సుందర కాండ, రాత్రి 8 గంటల నుంచి ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. హనుమాన్ మందిర్ మిత్ర సంఘ్ ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతాయన్నారు.

హనుమాన్ జయంతిని శాంతియుతంగా జరుపుకోవాలి


సాయి చైతన్య, డీసీపీ

చాంద్రాయణగుట్ట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పాతబస్తీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పాతబస్తీలో నిర్వహించనున్న మొత్తం 14 ర్యాలీలకు సంబంధించిన నిర్వాహకులతో ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేసి తగిన సూచనలు ఇచ్చామన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలలో నాలుగు ర్యాలీలు నగరంలో జరిగే ప్రధాన ర్యాలీలో కలుస్తాయన్నారు. ర్యాలీలో డీజేలు పెట్టకూడదని, భక్తులంతా శాంతియుతంగా ఊరేగింపు నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా కమ్యూనల్ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ ప్రసంగాలు చేయకూడదన్నారు. స్థానిక సిబ్బందితో పాటు జిల్లాల నుంచి 900 మంది పోలీసులు, 10 ప్లటూన్ల టీఎస్ఎస్‌పీ బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

చెత్తతో మూగజీవాలకు ముప్పు


చెత్త కుప్పల్లో మేస్తున్న జంతువులు

గోల్కొండ: రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలు, వ్యర్థాలు మూగ జీవాలకు ప్రాణాంతకంగా మారాయి. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన, రోడ్డు డివైడర్ల మధ్య ఉంటున్న చెత్త కుప్పల వద్ద ఆవులు, మేకలు లాంటి జంతువులు తమ ఆహారం కోసం తిరుగుతుంటాయి. ఇందులో అవి మేతను మేసి పలుమార్లు అనారోగ్యాల బారినపడుతున్నాయి. కుళ్లిన తినుబండారాల్లు, ప్లాస్టిక్, పురుగులు పడ్డ కూరగాయలు లాంటి వాటిని తినడం వల్ల ఈ జంతువులు రోగాల బారినపడుతున్నాయి. శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే జంతువులు మృతి చెందుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త డంపింగ్ వల్ల జంతువులకు ముంపు వాటిల్లుతుందని పలువురు అంటున్నారు.

ప్రజా రక్షణకు నిరంతరం కృషి చేయాలి


ఎక్విప్‌జ్ పరికరాలను పరిశీలిస్తున్న అడిషనల్ డీజీపీ అభిలాష బిస్ట్

చార్మినార్: లక్షలాది మంది అభ్యర్థులతో పోటీ పడి ఉద్యోగాలు పొందిన మీరంతా శిక్షణా కాలం అనంతరం ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు వారి ఆస్తులను కాపాడడంలో నిరంతరం కృషి చేయనున్నారని ఐపీఎస్ అధికారి అడిషనల్ డీజీపీ అభిలాష బిస్ట్ అన్నారు. సోమవారం ఆమె పేట్ల బురుజులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించి అక్కడి సిబ్బంది నిర్వహించిన పరేడ్‌లో గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం సేవలందించే డిపార్ట్‌మెంట్‌లో చేరడం గర్వంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ పోలీసు కమిషనర్ సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

టోలిచౌకీలో బీజేపీ ప్రచారం


ఇంటింటి ప్రచారంలో అశోక్‌కుమార్

గోల్కొండ: ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400 లకు పైగా స్థానాలు గెలుచుకుంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లో బీజేపీ ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి పనుల కరపత్రాన్ని పంచిపెట్టారు.

మజ్లిస్‌తోనే అభివృద్ధి సాధ్యం


మజ్లిస్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: మజ్లిస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో అవసరమైతే ప్రభుత్వంతో పోరాడి నిధులు తెస్తామన్నారు. మజ్లిస్ పార్టీ చేస్తున్న నిరంతర కృషి వల్లే నేడు కార్వాన్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి కోతలు ఉండడం లేదన్నారు. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తన ఎంపీ లాడ్ నిధులను ఎక్కువగా కార్వాన్ నియోజకవర్గానికి కేటాయించారన్నారు. అదే విధంగా మజ్లిస్ పార్టీ ప్రజల పార్టీ అని అందువల్లే కులమతాలకు సంబంధం లేకుండా కార్వాన్ ప్రజలు మజ్లిస్ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పఠాన్, మిర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులున్నారు.

లష్కర్‌లో కాంగ్రెస్‌దే విజయం


బంగారు మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దానం నాగేందర్, సంతోష్‌గుప్తా

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ పేర్కొన్నారు. పబ్లిక్‌గార్డెన్ వద్ద ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో సోమవారం ఆయన పూజలు చేశారు. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ..బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయన్నారు. ఈ రెండు పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమం, ప్రగతి, అభివృద్ధికి ఆకర్షితులై అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీవైపే ఉన్నారన్నారు. ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి ప్రజలకు ఏ రోజు కూడా అందుబాటులో లేరన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు.

పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలి


పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట: హనుమాన్ జయంతి ర్యాలీలను పురస్కరించుకొని అన్ని రకాల బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. కందికల్‌గేట్ గంగపుత్ర సంఘం హాల్‌లో సోమవారం ఆయన ఛత్రినాక డివిజన్ పోలీసులతో సమావేశమయ్యారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కమ్యూనల్ రౌడీషీటర్లపై కన్నేసి ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.